


# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 24-06-2022 సంపుటి: 03 సంచిక: 271 పేజీలు: 4 వెల: రూ 3-00


## అపాచీ పరిశ్రమతో 10 వేల మందికి ఉద్యోగాలు



తిరుపతి జిల్లా: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఇనగలూరులో రూ. 700 కోట్లతో ఏర్పాటు చేయబోతున్న అపాచీ పరిశ్రమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. ఇనగలూరులో అపాచీ పరిశ్రమ ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమన్నారు. మొదటి దశలో రూ.350 కోట్లు, వచ్చే ఐదేళ్లలో మరో 350 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు సీఎం జగన్ తెలిపారు.అపాచీ పరిశ్రమలో అడిడాస్ షూలు, లెదర్ జాకెట్స్, బెల్ట్‌లు వంటి ఉత్పత్తులను తయారు చేస్తారు. అపాచీ పరిశ్రమ ఏర్పాటుతో 10 వేల మందికి ఉద్యోగాలు అవకాశాలు లభిస్తాయన్నారు. 2023 సెప్టెంబర్ కల్లా పరిశ్రమ అందుబాటులోకి వస్తుందన్నారు. పరిశ్రమ ఏర్పాటుతో 80 శాతం మంది స్థానికులకే ఉద్యోగాలు వస్తాయని సీఎం జగన్ తెలిపారు.

ఏపీ ప్రభుత్వం తోడ్పాటు మరువలేనిది: టోనీ

పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందించిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి అపాచీ కంపెనీ డైరెక్టర్ టోనీ కృతజ్ఞతలు తెలియజేశారు. పరిశ్రమల ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం అందించిన తోడ్పాటు మరువలేనిదన్నారు. పారిశ్రామికరంగాన్ని సీఎం జగన్ ప్రోత్సహిస్తున్నారన్నారు.




## రాష్ట్రపతి ఎన్నికల్లో జగన్‌దే తుది నిర్ణయం : ఎంపీ

అమరావతి : రాష్ట్రపతి ఎన్నికల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలో అనే అంశం ఏపీ సీఎం జగన్‌దే తుది నిర్ణయమని ఎంపీ విజయ సాయిరెడ్డి వెల్లడించారు. ఎన్డీయే అభ్యర్థిగా ఎస్టీకి చెందిన మహిళ పేరును ఖరారు చేయడాన్ని ఆయన స్వాగతించారు. ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్రపతిగా అవకాశం ఇస్తామంటే ఎవరు వద్దంటారని పేర్కొన్నారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు.పరిపాలన వికేంద్రీకరణ ద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన వెల్లడించారు. మూడు రాజధానుల వ్యవహారంపై ఆయన స్పందించారు. విశాఖలోనే పరిపాలన రాజధాని వుంటుందని, ఎవరు ఆపినా ఆగదన్నారు. కాలువలు, చెరువులు, నదులు ఆక్రమించే హక్కు ఎవరికీ లేదని టీడీపీ నాయకుడు అయ్యన్నపాత్రుడు చెరువు కాలువ కబ్జాపై మాట్లాడారు. హైకోర్టులో అయ్యన్నకు తాత్కాలికంగా స్టే ఇచ్చినా అది తాత్కాలికమేనని అన్నారు.



## ప్రధాని మోదీతో ద్రౌపది ముర్ము భేటీ



న్యూఢిల్లీ: రాష్ట్రపతి అభ్యర్థిగా ద్రౌపది ముర్మును ఎంపిక చేయడాన్ని దేశంలోని అన్ని వర్గాలు స్వాగతిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి సమస్యలపై ఆమెకు మంచి అవగాహన ఉందని, దేశాభివృద్ధిపై అద్భుతమైన ముందుచూపు ఉందని ట్విటర్‌లో ప్రశంసించారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డీఏ) రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన ద్రౌపది ముర్ము గురువారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలో ఆమెను ప్రశంసిస్తూ ప్రధాని ట్వీట్ చేశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కూడా ద్రౌపది ముర్ము మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛంతో ఆమెను అమిత్ షా స్వాగతించారు. బీజేపీ సీనియర్ నాయకులతోనూ ఆమె భేటీ అవుతారు. రాష్ట్రపతి ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని వివిధ పార్టీల నాయకులను కలిసి ఆమె కోరనున్నారు. కాగా, జూన్ 24న ఆమె నామినేషన్ దాఖలు చేయనున్నారు. జూలై 18న రాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ జరుగుతుంది.

## శ్రీ వకుళమాత ఆలయాన్ని ప్రారంభించిన ఏపీ సీఎం



తిరుపతి : తిరుపతి సమీపంలోని పేరూరు బండపై పునర్నిర్మించిన శ్రీ వకుళమాత ఆలయాన్ని ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో సీఎం ను సన్మానించి శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు .మంత్రి పెద్దిరెడ్డి తన సొంత నిధులతో పాటు టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వకుళ మాత ఆలయం వద్ద 83 ఎకరాల 42 సెంట్ల భూమి ఉందని, ఈ ప్రాంతం లో టీటీడీ కల్యాణ మండపం, అతిధి భవనం నిర్మిస్తుందని మంత్రి పెద్దిరెడ్డి పేర్కొన్నారు. దాదాపు 20 కేజీల బంగారంతో ఆలయ గోపురానికి 5 కలశాలు, విమానానికి ఒక కలశం టీటీడీ సహకా రంతో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అంతకుముందు ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న సీఎంకు రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి, నారాయణస్వామి, రోజా, టీటీడీ ఈవో ధర్మారెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

## ఆ ప్రచారం అవాస్తవం.. 'అమ్మ ఒడి'పై మంత్రి బొత్స క్లారిటీ



విజయనగరం: ఈ నెల 27న అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహిస్తామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదగా తల్లుల అకౌంట్లలోకి నగదు జమ చేస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. గతంలో 32 శాతం మాత్రమే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక విద్యార్థుల సంఖ్య 65 శాతానికి పెరిగిందన్నారు.అమ్మ ఒడి లబ్ధిదారుల సంఖ్య తగ్గిందనడం అవాస్తవమన్నారు. అటెండెన్స్ ఆధారంగా లబ్ధి చేకూరుతుందన్నారు. పిల్లలను సక్రమంగా స్కూల్‌కు పంపితేనే పథకం వర్తిస్తుందన్నారు. రూ.2 వేలు అనేది పాఠశాల నిర్వహణ కోసం ఖర్చు చేస్తాన్నారు. స్కూళ్లు, కాలేజీల్లో అధ్యాపకులు కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి బొత్స తెలిపారు.

## ఏపీలో దుల్హన్ పథకం నిలిపివేత




అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో పేద మైనార్టీ వివాహాలకు అందజేస్తున్న దుల్హన్ పథకాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. ఆర్థిక ఇబ్బందులతో నిలిపివేసినట్లు హైకోర్టుకు వివరించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ పథకం ద్వారా రూ.50వేలు ఆర్థిక సహాయన్ని రాష్ట్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా అందజేస్తుంది. అయితే దుల్హన్ పథకం నిలిపివేతను సవాల్ చేస్తూ మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నాయకుడు షిబ్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.పథకం అమలుకు డబ్బులు లేవని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు వివరించారు.2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ స్కీంను ప్రవేశపెట్టింది. రూ. 50వేలు ఉన్న పరిహారాన్ని లక్షకు పెంచుతామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్ ప్రభుత్వం ఆ హామీని అమలు చేయడం లేదంటూ పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకం ద్వారా అందిస్తున్న సహాయాన్ని ప్రభుత్వం తగ్గించిన విషయం తెలిసిందే.ఈ స్కీం ద్వారా విద్యార్థులకు రూ. 15 వేలు ఇవ్వగా ప్రస్తుతం రూ.13వేలు మాత్రమే ఇస్తున్నామని మంత్రి బొత్స ప్రకటించారు.

## ఇక రాజకీయాలకు దూరం : మాజీ మంత్రి

అమరావతి : మాజీ మంత్రి, టీడీపీ నాయకురాలు గల్లా అరుణకుమారి ఇక రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. తన కుమారుడు గల్లా జయదేవ్ టీడీపీ నుంచి ఎంపీగా పనిచేస్తున్నాడని టీడీపీకి తన మద్దతు ఉంటుందని వెల్లడించారు. ఇవాళ ఆమె మీడియాతో మాట్లాడారు. టీడీపీకి తాము పెద్ద దిక్కుకాదని, చంద్రబాబే పార్టీకి పెద్ద దిక్కని స్పష్టం చేశారు. తన అనుచరులకు స్వేచ్ఛ ఇచ్చానని, ఎక్కడ నచ్చితే అక్కడ ఉండొచ్చని సూచించానని తెలిపారు. రాజకీయాల్లో చేయని పదవీ లేదు,చూడని రాజకీయం లేదని పేర్కొన్నారు.చిత్తూరు జిల్లా కు చెందిన గల్లా అరుణకుమారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రగిరి నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా , ఒకసారి మంత్రిగా పనిచేశారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం ఏపీ టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోఓడిపోయారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలిగా కొనసాగిన ఆమె 2019 ఎన్నికల్లో నియోజకవర్గ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన నాటి నుంచి టీడీపీకి దూరంగా ఉంటున్నారు.



## కేంద్రమంత్రి హరిదీప్ సింగ్‌తో మంత్రి కేటీఆర్ భేటీ



న్యూఢిల్లీ : ఢిల్లీలో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హరిదీప్ సింగ్ పూరీతో రాష్ట్ర ఐటీ, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కేటీఆర్ గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్లాన్‌కు ఆర్థిక సాయం చేయాలని కేంద్రమంత్రిని కేటీఆర్ కోరారు. ఎస్టీపీల నిర్మాణాలకు రూ. 8,654.54 కోట్లు ఖర్చు అవుతుందని కేటీఆర్ తెలిపారు. ప్రాజెక్టు వ్యయంలో మూడో వంతు అమృత్-2 కింద రూ. 2,850 కోట్లు ఇవ్వాలని వినతి చేశారు. హైదరాబాద్‌లో వ్యక్తిగత రాపిడ్ ట్రాన్సిట్ కారిడార్‌కు సహకరించాలని కేంద్రమంత్రిని కేటీఆర్ కోరారు.

## విజయవంతంగా రోదసీలోకి దూసుకెళ్లిన జీశాట్-24

న్యూఢిల్లీ : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) జీశాట్-24 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్షలో ప్రవేశపెట్టింది. ఈ ఉపగ్రహాన్ని ఫ్రెంచ్ కంపెనీ ఏరియన్ స్పేస్ గురువారం ఫ్రెంచ్ గయానా (దక్షిణ అమెరికా)లోని కౌరూ అంతరిక్ష కేంద్రం నుంచి ఏరియన్?5 రాకెట్‌తో ఇస్రో రోదసీలోకి పంపింది. న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్), కేంద్ర ప్రభుత్వం తరపున డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్(డీఓఎస్) సంయుక్తంగా 4,180 కిలోల బరువు కలిగిన జీశాట్?24 ఉపగ్రహాన్ని కక్షలో ప్రవేశపెట్టాయి.ఈ ఉపగ్రహంలో 24 కేయూ బ్యాండ్ ట్రాన్స్‌ఫాండర్లు అమర్చి డీటీహెచ్ అప్లికేషన్ అవసరాలను తీర్చేందుకు పాన్ ఇండియా కవరేజీతో రోదసీలో పంపారు. జీశాట్?25తో డీటీహెచ్ అప్లికేషన్‌లో నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. అంతరిక్ష రంగ సంస్కరణల తర్వాత న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) ప్రారంభించిన డిమాండ్ ఆధారిత కమ్యూనికేషన్ శాటిలైట్ మిషన్ ఇదేకావడం విశేషం. ఇదిలా ఉండగా.. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్(షార్)లో రెండో లాంచ్‌ప్యాడ్ నుంచి ఈ నెల 30న సాయంత్రం 6 గంటలకు పీఎస్ఎల్‌వీ సీ53 ప్రయోగాన్ని నిర్వహించేందుకు ఇస్రో ఏర్పాట్లు చేస్తున్నది.



# సంపాదకీయం

శుక్రవారం 24-06-2022

## పెట్రో ధరలకు కళ్లెమెప్పుడు

రయ్‌మంటూ బైక్ మీద వెళుతూ హఠాత్తుగా పెట్రోల్ అంతగా లేదని గుర్తొచ్చి ఒక కుర్రాడు పెట్రోల్ బంక్ వెళ్లాడు. స్టయిల్‌గా లీటర్ అనగానే బంక్ వాడు రవ్వంత ఎక్కువే కొట్టి చిల్లర లేకుండా పెద్ద మొత్తమే తీసుకున్నాడు. కుర్రాడు ఆశ్చర్యపోయాడు. ఇదే దృశ్యం ఈ రోజుల్లో అన్ని ప్రాంతాల్లో చూస్తున్నాం. అసలు ఇలా పెట్రోల్ రేటు ఎందుకు పెరుగుతోంది? నిజానికి రష్యా ఫిబ్రవరి 24న ఉక్రెయిన్ మీద దాడి చేయడానికి ముందు నుంచే పెట్రోల్ ధరలు ఆకాశా న్నంటాయి. కానీ మార్చి మధ్య నుంచి ముడి చమురు ధర పెరగడంతో పెట్రోల్ ధరలు పెరుగుతూ వచ్చా యి. పెరిగిపోయిన ప్రపంచ డిమాండ్‌ను తీర్చడానికి ముడి చమురును గ్యాసోలిన్, డీజిల్‌గా శుద్ధి చేయడానికి తగిన సామర్థ్యం లేకపోవడమే దీనంతటికీ కారణం.అంతర్జాతీయ ఎనర్జీ ఏజెన్సీ (ఐఇఏ) ప్రకారం, ప్రపంచ రిఫైనరీలు రోజూ వంద మిలియన్ బ్యారల్స్ చమురు ఉత్పత్తి చేస్తాయి. కానీ అందులో సుమారు 20 శాతం ఉపయోగపడటం లేదని తెలిసింది. ఇందులోనూ అధిక భాగం లాటిన్ అమెరికా, ఇతర ప్రాంతాల్లోనే వినియోగంలో లేదు. అందుక్కారణం అక్కడ పెట్టుబడుల లోపం కారణంగా చెప్పుకోవచ్చు. ఫలితంగా అంచనా సామర్థ్యంలో రోజుకు సుమారు 82-83 మిలియన్ బ్యారెల్ ఉత్పత్తి విక్రయానికి నోచుకోక మిగిలిపోతోంది. 2020 ఆరంభం నుంచి రోజూవారి రిఫైనింగ్ సామర్థ్యంలో 3.3 మిలియన్ బ్యారెల్స్ చమురును ప్రపంచ దేశాలు నష్టపోతున్నాయని రిఫైనింగ్ ఇండస్ట్రీ అంచనా. ఈ నష్టంలో సుమారు మూడవ వంతు యు. ఎస్ లో సంభవించింది. మిగతా నష్టం రష్యా, చైనా, యూరప్‌లో సంభవించింది. కాగా కోవిడ్-19 ప్రభావం తొలినాళ్లలో లాక్‌డౌన్, పనులు నిలిచిపోవడం మొదలయిన కారణాల వల్ల చమురు డిమాండ్ బాగా పడిపోయింది. అంతకుముందు మూడు దశాబ్దాల్లో అంతగా రిఫైనింగ్ సామర్థ్యం పడిపోలేదు. రిఫైనింగ్ సామర్థ్యం పుంజుకునే అవకాశం వుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రపంచవ్యాప్తంగా చమురు శుద్ధి సామర్థ్యం విస్తరణ 2022లో రోజుకు ఒక మిలియన్ బిపిడి విస్తరణకు నిర్ధారించబడింది. అలాగే 2023 లో 1.6 మిలియన్ బిపిడిలు. ఈ ఏడాది ఏప్రిల్‌లో రోజుకు 78 మిలియన్ బ్యారెల్స్ ప్రాసెస్ జరిగింది. ఇదే కోవిడ్-19కి ముందు సుమారు 82.1 మిలియన్ బిపిడిలు ప్రాసెస్ జరిగింది. చైనా రిఫైనర్‌లు ఆన్‌లైన్‌కు తిరిగి రావడంతో వేసవిలో రిఫైనింగ్ 81.9 మిలియన్ బిపిడి కి పుంజుకుం టుందని ఐఇఏ అంచనా. అయితే యు.ఎస్, చైనా, యూరప్ అన్నీ కోవిడ్-19కి ముందుకంటే తక్కువ స్థాయిలో చమురు శుద్ధి సామర్థ్యం తక్కువ స్థాయిలో చేపడుతున్నాయి. యు.ఎస్. రిఫైనరీలు అనేక కార ణాల వల్ల 2019 నుంచి సుమారు ఒక మిలియన్ బిపిడి తగ్గించింది. రష్యా చమురు శుద్ధి సామర్థ్యం మే నెల నుంచి సుమారు 30 శాతం నిరుపయోగంగా వుంది. పైగా రష్యా చమురును అనేక పశ్చిమ దేశాలు నిరాకరించాయి. ధర పెరగడానికి కారకాల విషయానికివస్తే, ప్రపంచ వ్యాప్తంగా వున్న డిమాండ్ పెరగడంతో సముద్ర మార్గంలో ఓడల్లో చమురు ఉ త్పత్తులను తీసికెళ్లడానికి అయ్యే ఖర్చు పెరిగిపోయిది. యూరప్‌లో నేచు రల్ గ్యాస్ ధరలు ఆకాశాన్నంటడం చమురు శుద్ధి కర్మాగారాలకు ఆటంకంగా మారింది. కాగా కొన్ని చము రు శుద్ధి కర్మాగారాలు మధ్యంతర చమురుగా వాక్యూమ్ గ్యాస్ ఆయిల్ మీద ఎక్కువగా ఆధారపడ్డాయి. రష్యా గ్యాస్ ఆయిల్ నష్టాలతో కొన్న గ్యాస్ ఆయిల్ ఉ త్పత్తి యనిట్లు నిలిచిపోయాయి. ఈ పరిస్థితులు కొందరికి ఎంతో ఉపయోగకరంగా మారాయి. ముఖ్యంగా యు.ఎస్. రిఫైనరీలు వంటి విదేశా లకు అత్యధిక చమురును ఎగు మతి చేసే రిఫైనరీలే ఎక్కువగా లబ్ధి పొందాయి. ప్రపంచ వ్యాప్తంగా చమురు తరుగుదల చమురు శుద్ధి పరిమితులను చారిత్రాత్మకంగా అత్యధిక స్థాయికి చేర్చడం గమనార్హం.

# ప్రైవేట్ సంస్థకు సీనరేజ్ వసూళ్లు

గుంటూరు, జూన్ 23, ఏపీ సర్కార్ కు వేల కోట్లలో లీజులు ఇస్తున్న శాఖకు నామమాత్రపు సీనరేజ్ వసూలు చేయడం మాత్రం బరువైపోతోందట. అందుకే ఈ బాధ్యతలను ప్రయివేటుకు అప్పగిస్తారట! వసూళ్లు చేసిపెట్టే సంస్థలకు కమిషన్ రూపంలో ఆదాయాన్ని సమకూర్చాలని సర్కారు యోచిస్తోంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు గనుల శాఖ తెరపైకి తీసుకువచ్చింది. ఇక ఖనిజాలను తీసుకువెళ్లే వాహనాలు బరువు చెక్‌చేసుకునే వేయింగ్ మిషన్లను కూడా ప్రయివేటుకు కట్టబెట్టాలని దాదాపుగా నిర్ణయి ంచింది.కొద్ది రోజుల క్రితం జరిగిన సమావేశంలో ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయడం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా 6388 గనులను లీజుకు ఇచ్చారు. ఇప్పటివరకు వీటిపై అధికారం మైనింగ్ శాఖకే ఉంది. అయితే ఖనిజ రవాణా, సీనరేజ్‌లను వసూలు చేయడం శాఖలోని సిబ్బందికి కష్టంగా మారుతున్నట్లు ఆ శాఖ చెబుతోంది. సరైన దృష్టి సారించకపోవడం వల్ల ఆర్థికంగా నష్టం వాటిల్లుతున్నట్లు చెబుతున్నారు. అందుకే జిల్లాను ఒక యూనిట్‌గా గుర్తించి అక్కడ సీనరేజ్ వసూళ్ల బాధ్యతలను ప్రయివేటు సంస్థలకు అప్పగించాలని నిర్ణయించారు. దీనికి థర్డ్ పార్టీ అని ఒక ముద్దు పేరు కూడా పెట్టనున్నారు. ఇలా ప్రయివేటుకు వసూళ్ల బాధ్యత అప్పగించడం వల్ల 35 నుంచి 40 శాతం అదనపు ఆదాయం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం సీనరేజ్ ద్వారా గత మూడేళ్లలో సగటున రూ.1,261 కోట్లు ఆదాయం వస్తుండగా, ప్రయివేటుకు అప్పగించడం ద్వారా రూ.1,765 కోట్లు వస్తుందని అధికారులు అరచనా వేస్తున్నారు. అయితే 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.1643 కోట్లు వసూలైన విషయం గమనిస్తే ఇది ప్రయివేటుకి ఇచ్చిన తరువాత వచ్చే అంచనా ఆదాయంకన్నా 122 కోట్లు మాత్రమే తక్కువ.గనుల తవ్వకాల అనంతరం ఖనిజాన్ని రవాణా చేసే సమయంలో భారీగా అక్రమాలు జరుగుతున్నట్లు చాలాకాలంగా ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. దీనిని గుర్తించడంలో, అరికట్టడంలో ఆ శాఖ సిబ్బంది విఫలమవుతున్నారు. అయితే ఇది నిర్లక్ష్యం కాదని, ఒత్తిడి వల్లనే అని చెబుతున్న అధికారులు తరలింపు సమయంలో వాటి బరువును తూచేందుకు గనులకు సమీపంలోనే వేబ్రిడ్జిలను ఏర్పాటుచేయాలని ప్రతిపాదిస్తోంది. అయితే ఇవి కూడా ప్రయివేటు రంగం ద్వారానే ఏర్పాటుచేయాలని భావిస్తుండడం విశేషం. వేబ్రిడ్జిల వద్ద, క్వారీల వద్ద సిసి కెమేరాలను కూడా ఏర్పాటుచేయాలని ప్రతిపాదిస్తున్నారుగ్రానైట్ వంటి ఖనిజాలపై సీనరేజ్‌ను వసూలు చేసే సమయంలో వాటి ఘనపుటడుగులు, విస్తీర్ణం ఆధారంగా లెక్కించేవారు. అయితే తాజాగా ఖనిజం బరువు ఆధారంగా సీనరేజ్‌ను లెక్కించాలన్న కొత్త ప్రతిపాదన కూడా తెరపైకి తీసుకువస్తున్నారు. ఖనిజ విస్తీర్ణం కన్నా బరువును ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల సీనరేజ్ లెక్కలు పక్కాగా ఉంటాయని అధికారులు అంటున్నారు. ఈ విధానంతో 25 శాతం ఆదాయం అదనంగా పెరుగుతుందని వారు అంచనా వేస్తున్నారు. దీనివల్ల ఖనిజాల అక్రమ రవాణాకు చెక్ పెట్టవచ్చునని వారు అభిప్రాయపడుతున్నారు. ఆదాయం పెరిగినా ప్రయివేటుకు బాధ్యతలు అప్పగించడం వల్ల ప్రభుత్వం కొంత కమిషన్ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని భావిస్తున్నారు. రవాణా చేసే వారి నుంచి ప్రయివేటు సంస్థలు కమిషన్ తీసుకుంటే అది వినియోగదారులపై ఆర్థికంగా ప్రభావం పడుతుందని అంటున్నారు.

# జనసేన ఓపెన్ ఆప్షన్స్

విజయవాడ, జూన్ 23, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టమైన వైఖరితో ఉన్నారు. ఆయన ఈసారి ముఖ్యమంత్రి అభ్యర్థిగానే ఎన్నికల బరిలోకి దిగాలనుకుంటున్నారు. ఇది వందశాతం వాస్తవం. ఈసారి పొత్తులు ఉ న్నప్పటికీ తగ్గకూడదన్నది కింది స్థాయి క్యాడర్ నుంచే కాకుండా పార్టీలో నేతల నుంచి డిమాండ్. అభిమానులతో పాటు కాపు సామాజికవర్గం ఈసారి పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటుంది. ప్రతిసారి వేరే వారి కోసం త్యాగాలు చేయాల్సిన అవసరం లేదని పార్టీ క్యాడర్ ఏకాభిప్రాయంగా చెప్పుకోవాలి. పర్చూరు సభలో ఆయన స్పష్టం చేశారు.. జనసేన అధినేత పవన్ కల్యాణ్ మూడు ఆప్షన్లు ముందుంచారు. టీడీపీతో పొత్తు పెట్టుకోవడానికి తాను సిద్ధమని ఒక రకంగా ఓపెన్ అయ్యారు. ఈసారి వేరే వాళ్లు తగ్గాలని కూడా చెప్పారు. పవన్ కల్యాణ్ తొలుత పొత్తుల గురించి ప్రస్తావన తేవడంతో టీడీపీ అప్రమత్తమయింది. చంద్రబాబు ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేసేంత నేత కాదు. ఆయన తనకున్న అనుభవం, పరిపాలన దక్షత వంటివి పదే పదే తమ పార్టీ నేతలతో చెప్పిస్తుండటం ఇందుకు సంకేతాలని చెప్పాలి. అయితే పర్చూరు నుంచి పవన్ కల్యాణ? టీడీపీకి హెచ్చరిక జారీ చేశారు. తాను పొత్తుకు సిద్దంగా లేనని, ఒంటరిగా పోటీ చేస్తానని, తనను ఆదరించి, ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఒకరకంగా టీడీపీకి ఇది తాను పొత్తుకు సిద్ధంగా లేనన్న వార్నింగ్ గానే చెప్పుకోవాల్సి ఉ ంటుంది. కానీ పవన్ కల్యాణ్ కూడా ఈసారి పట్టుదలతో ఉన్నారు. తాము ఈసారి లొంగిపోతే తమ ఓటు బ్యాంకుకు పూర్తిగా నష్టపోతామని భావిస్తున్నారు. చంద్రబాబును మరోసారి సీఎం చేయడానికి పవన్ కు ఎందుకు ఓటు వేయాలన్న భావన క్యాడర్ లోనూ, ప్రధాన సామాజికవర్గంలోనూ కలిగితే తనకు దీర్ఘకాలంగా నష్టం తప్పదు. ఈసారి ఓటమి పాలయినా తనకు ప్రత్యేకంగా జరిగే నష్టమేమీ లేదు. తనకు వయసు ఉంది. భవిష్యత్ లో ఓటు బ్యాంకు పెంచుకునే వీలుంది. అందుకే పవన్ ఈసారి తగ్గకూడదనే నిర్ణయించుకున్నారని తెలిసింది. దీంతో జనసేన పోటీ చేస్తే బీజేపీతో కలసి పోటీ చేస్తుంది. లేకుంటే ఒంటరిగానైనా బరిలోకి దిగాలని భావిస్తున్నారు. ఒంటరిగా పోటీ చేయడమే మేలన్న అభిప్రాయమూ వ్యక్తమవుతుంది. బీజేపీతో పెద్దగా టచ్ లో లేనట్లే కన్పిస్తుంది. ఆత్మకూరు ఉప ఎన్నికల్లోనూ జనసేన జెండా బీజేపీ అభ్యర్థి ప్రచారంలో కనపడడటం లేదు. పవన్ కూడా అక్కడకు ప్రచారానికి వస్తారన్న నమ్మకం లేదు. జనసేన క్యాడర్ కు పూర్తి స్థాయిలో సిగ్నల్స్ వెళ్లడంతోనే జెండాలు పక్కన పెట్టేశారంటున్నారు. దీంతో పవన్ ఈసారి ఒంటరిగా పోటీ చే?సే అవకాశాలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. టీడీపీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా పవన్ ను అంగీకరిస్తేనే పొత్తు కుదురుతుంది. ఇది పార్టీ ఇన్నర్ వర్గాల టాక్. ఇప్పుడు బంతి టీడీపీ కోర్టులో ఉంది. టీడీపీ సీఎం అభ్యర్థిగా అంగీకరిస్తేనే పవన్ పొత్తుకు సిద్దమవుతారు. ఇది ఫిక్స్.

## ఏపీలో ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త.. వచ్చే నెల నుంచి ప్రభుత్వ వేతనాలు

అమరావతి: రాష్ట్రంలో పనిచేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వచ్చే నెల నుంచి వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి ప్రభుత్వ వేతన స్కేల్ ప్రకారం జీతాలు ఇచ్చేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సీఎం జగన్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ రెండేండ్ల క్రితం ఏపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇకపై ఆర్టీసీ ఉద్యోగులకు జూలై 1 నుంచి ప్రభుత్వ వేతన స్కేల్ ప్రకారం జీతాలు అందుతాయి. ప్రభుత్వంలో విలీనం చేసినప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు కార్పొరేషన్ పే స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ ఉద్యోగులకు క్యాడర్ సర్టిఫికేషన్‌ను ప్రభుత్వం ఇటీవల పూర్తి చేసింది. ఉ ద్యోగుల జీతాలు, ఇతర అలవెన్సులు నిర్ధారించబడిన క్యాడర్‌ను అనుసరించి నిర్ణయిస్తారు. జీతం చెల్లింపు ప్రక్రియపై పే స్లిప్‌ల తయారీ, ఇతర ఫార్మాలిటీలు పూర్తయ్యాయి. తాజా పీఆర్సీ ప్రకారం ఏడాదిపాటు ఫిట్ మెంట్ నిర్ణయించి అమలు చేయనున్నారు. దీనివల్ల ఆర్టీసీ ఉద్యోగులకు గరిష్ట ప్రయోజనం చేకూరనున్నది. ప్రధానంగా డ్రైవర్లు, కండక్టర్లు, కిందిస్థాయి సిబ్బందికి ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని ఆర్టీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఏడీసీలుగా పదోన్నతి పొందిన డ్రైవర్లు, కండక్టర్లకు అదనపు ప్రయోజనాలపై తొలుత కొంత సందేహాలు నెలకొన్నాయి. అయితే దీనిపై ఆర్టీసి అధికారులు ఆర్థిక శాఖను సంప్రదించి తదనుగుణంగా చర్యలు తీసుకోవడంతో వారికి అదనపు ఆర్థిక ప్రయోజనం కూడా కలుగనున్నది. మరోవైపు రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో విజయవాడలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ అదనంగా హెచ్‌ఆర్‌ఏ చెల్లించనున్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు దాదాపు 200 మందికి మాత్రమే హెచ్‌ఆర్‌ఏ అదనంగా చెల్లిస్తున్నారు. అయితే,ప్రభుత్వ ఉద్యోగిగా మారిన తర్వాత విజయవాడలో పనిచేసే అందరికీ అదనపు హెచ్‌ఆర్ లభిస్తుంది. ప్రభుత్వ పే స్కేల్‌తో భవిష్యత్‌లో తమకు మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయని ఆర్టీసీ కార్మికులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.




# చేతికి అందని నష్టపరిహారం

కాకినాడ, జూన్ 23, తూర్పుగోదావరి జిల్లాలో గత జులై నుంచి అక్టోబర్ మధ్య నాలుగుసార్లు తుపాన్లు, భారీ వర్షాలు వచ్చి రైతులు రూ.కోట్ల విలువైన పంటలను నష్టపోయారు. ఆయా సందర్భాల్లో పంటలను కోల్పోయిన రైతులకు పరిహారం అందించేందుకు అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించారు. గత ఏడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో పంటలు నష్టపోయిన వారిలో కొందరికి పరిహారం చెల్లించింది. మిగిలిన వారికి నేటికీ పరిహారం అందలేదు. సుమారు పది కోట్ల రూపాయలు పరిహారం పెండింగ్ ఉన్నట్లు సమాచారం. జిల్లాలో వరితోపాటు పత్తి, మొక్కజన్న, అపరాల పంటలకు నష్టం వాటిల్లింది. వరి, పత్తి పంటలకు ఎకరాకు రూ.15 వేలు, అపరాలు, మొక్కజన్నకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారంగా ప్రభుత్వం నిర్ణయించింది. 33 శాతానికిపైగా పంట నష్టం జరిగితేనే పరిహారం కోసం ప్రభుత్వానికి అధికారులు సిఫార్సు చేశారు. కరోనా నేపథ్యంలో తీవ్ర ఆర్థిక ఎదుర్కొంటున్న తమకు బకాయిలు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. 2019 జులై, ఆగస్టులో 18 మండలాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖాధికారులు అంచనాలు రూపొందించారు. 5,207 మంది రైతులకు చెందిన 5,240 ఎకరాల్లో వరి, 458.65 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నట్లు ప్రభుత్వానికి నివేదించారు. రూ.3.46 కోట్ల నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇదే ఏడాది సెప్టెంబర్‌లో నాలుగు మండలాల్లో 465 మంది రైతులకు చెందిన 770 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని, రూ.45.86 లక్షలు పరిహారం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అక్టోబర్‌లో 16,100 మంది రైతులకు చెందిన 17,144.6 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. రూ.10.25 కోట్ల నష్టపరిహారం కోసం వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. 2020 ఏప్రిల్‌లో ఆరు మండలాల్లో 286 ఎకరాల్లో వరి, నాలుగు ఎకరాల్లో అపరాలు, రెండు ఎకరాల్లో మొక్కజన్నకు నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. రూ.17.42 లక్షల పరిహారం మంజూరు చేయాలంటూ ప్రభుత్వానికి నివేదించారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నష్టపోయిన వారిలో సుమారు 40 శాతం మంది రైతులకు మాత్రమే వారి ఖాతాల్లో సొమ్ము జమ అయినట్లు సమాచారం. ఆధార్, బ్యాంకు ఖాతాల అనుసంధానం సక్రమంగా లేకపోవడంతో వారిలో కొందరికి పరిహారం డబ్బులు పడలేదని, వాటిని సరిచేసే పనిలో ఉన్నామని అధికారులు చెప్తున్నారు. దీనిపై వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కెఎస్‌వి.ప్రసాద్‌ను వివరణ కోరగా, త్వరలో అందరికీ పరిహారం అందుతుందని తెలిపారు.

## తెరపైకి ఫిఫ్టీ ఫిఫ్టీ ఫార్ములా

విజయవాడ, జూన్ 23,నలభై ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు తన సభలకు వస్తున్న జనాలను చూసి మురిసిపోరు. ఆ జనం ఎలా వచ్చారన్నది ఆయనకు తెలియంది కాదు. అనుభవం ఉన్న నేతగా చంద్రబాబు పొత్తులనే కోరుకుంటారు. అయితే ఇందుకు జనసేన నుంచి గట్టిగా వస్తున్న డిమాండ్ పై కూడా ఆయన చివరి నిమిషంలో ఆలోచన చేయవచ్చు. టీడీపీ ఒంటరిగా పోటీ చేసి రెండోసారి జగన్ కు అధికారం అప్పగించి మరో ఐదేళ్లు ఇబ్బంది పడేంత తెలివి తక్కువ రాజకీయ నేత చంద్రబాబు కాదన్నది అందరికీ తెలిసిందే. . అందుకే చంద్రబాబు తాను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకునే అవకాశాలున్నాయి. అయితే ఇది బహిరంగంగా చెప్పకుండా కేవలం పార్టీల మధ్యనే పొత్తుల చర్చల మధ్య ఉంటాయంటున్నారు. టీడీపీ, జనసేన రెండున్నరేళ్లు ముఖ్యమంత్రి పదవిని పంచుకునేలా ఒప్పందం కుదుర్చుకునే తరహాలో ఆయన ఆలోచన ఉంటుందంటున్నారు. తొలి దఫా టీడీపీ, రెండో దఫా పవన్ కు సీఎం పదవి చేపట్టేలా అంగీకారం కుదుర్చు కునేలా చంద్రబాబు ఆలోచిస్తున్నారని కూడా చెబుతున్నారు. తన కుమారుడు లోకేష్ ను ముఖ్యమంత్రిగా చేయాలన్నది ఆయన ఆలోచన. తాను 14 ఏళు ముఖ్యమంత్రిగా ఉన్నారు. సీఎం పదవి పై తనకు ఎలాంటి ఆశలేదని పదే పదే సభల్లో చెబుతున్నారు. లోకేష్ చేత పాదయాత్ర చేయించి నాయకుడిగా మరింత ఎదగనిచ్చి అనంతరం ముఖ్యమంత్రిని చేయాలన్నది ఆయన ఆలోచిస్తున్నట్లు చెబుతున్నారు. ఎటూ పొత్తుల్లో సీట్ల సంఖ్య టీడీపీకి ఎక్కువగానే ఉంటుంది. గెలిచిన సభ్యుల్లో టీడీపీ బలమే ఎక్కువగా ఉంటుంది. జనసేనకు నలభైకి మించి సీట్లు ఇవ్వరు. అందుకే ఫిఫ్టీ ఫిఫ్టీ ఫార్ములాను ఆయన తెరపైకి తెస్తారని పార్టీ ఇన్నర్ వర్గాల టాక్. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## సత్తా చూపించే యత్నంలో హర్షకుమార్

రాజమండ్రి, జూన్ 23, పాతతరం నాయకులు కొత్త దారులు వెతుక్కుంటున్నారు. తాము ఇతర పార్టీలోకి వెళ్లేందుకు అహం అడ్డువస్తుంది. అలాగని ఉన్న పార్టీలో ఉండలేరు. దానికి ప్రజలు మద్దతు లేదు. అధికారంలోకి వచ్చే పార్టీలను ఆకర్షించాలంటే తన సత్తా ఏంటో చూపించుకోవాలి. తాను సీనియర్ నేతనే కాని, వృద్ధ నేతను కాదని నిరూపించుకోగలగాలి. రాజకీయ పార్టీలు రా.. రమ్మని ఆహ్వానించాలి. అదే ఇప్పుడు వారికి కావాల్సింది. అందులో ఇప్పుడు కాంగ్రెస్ సీనియర్ నేత హర్షకుమార్ ఒకరు. హర్షకుమార్ విజయం సాధించి దాదాపు దశాబ్దం దాటి పోయింది. గత రెండేళ్లు ఆయనకు ఎన్నికలు కలసి రాలేదు. గత ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. రాజమండ్రికి వచ్చిన చంద్రబాబు పాదాలపై హర్షకుమార్ పడ్డారు. అయినా టిక్కెట్ దక్కలేదు. అంటే ప్రజల్లో ఆయనకున్న ఇమేజ్ ను చంద్రబాబు గుర్తించారనుకోవాలి. తర్వాత ఆయన తిరిగి కాంగ్రెస్ లో చేరారు. రాష్ట్ర విభజన జరిగిన పదేళ్ల తర్వాతైనా కాంగ్రెస్ పుంజుకుంటుందని భావించారు. కానీ అది సాధ్యమయ్యే పని కాదు. ప్రజలు హస్తం గుర్తును మర్చిపోయినట్లే కన్పిస్తుంది. హర్షకుమార్ రాజకీయాన్ని అంత సులువుగా వదులుకునే నేత కాదు. దళిత నేతల్లో ఫైటర్ అనే చెప్పాలి. తాను అనుకున్నది అనుకున్నట్లు చెప్పేయగల మనస్తత్వం ఆయనది. ఆ వైఖరి జాతీయ పార్టీలలో నప్పుతుంది కాని, ప్రాంతీయ పార్టీలో అస్సలు కుదరదు. హర్షకుమార్ ను చేర్చుకుని ఆయన గెలిపించుకుని నెత్తిన కుంపటి పెట్టుకున్నట్లే భావిస్తారు అధినేతలు. అందుకే ఆయన తన సత్తాను నిరూపించుకునేందుకు సిద్ధమయ్యారు. తనకు చేవ తగ్గలేదని పార్టీ అధినేతలకు చూపేందుకు రెడీ అయిపోయినట్లే కన్పిస్తున్నారు. వచ్చే సెప్టంబరు నెల 26వ తేదీన రాజమండ్రిలో దళిత సింహగర్జన సభ పెట్టారు. ఈ సభకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి పది లక్షల మంది దళితులను సమీకరించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు ఆయన సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నారు. హర్షకుమార్ వైఖరిని చూస్తుంటే ఏదో ఒక పార్టీ తన సత్తువను గమనించి ఆహ్వానిస్తుందనే ఈ శ్రమంతా పడుతున్నట్లు కనిపిస్తుంది. వైసీపీలోకి ఎటూ హర్షకుమార్ వెళ్లరు. ఆ పరిస్థితి కూడా లేదు. జనసేన, టీడీపీలు తనను ఆహ్వానించి టిక్కెట్ ఇవ్వాలని హర్షకుమార్ ఈ ప్రయత్నాలు ప్రారంభించినట్లే కనపడుతుంది. మరి లేకుంటే రెండేళ్ల ముందు దళిత సింహ గర్జన సభ ఎన్నికలకు రెండేళ్లకు ముందు పెడుతున్నారంటే ఆయన మనసెరిగిన వారు మాత్రం అదే అనుకుంటున్నారు.

## విశాఖలో అడ్డూ, అదుపు లేకుండా భూ దందా

విశాఖపట్టణం, జూన్ 23, విశాఖ బ్రిటిష్ వారి కాలంలో జిల్లాగా ఏర్పడింది. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న ప్రాంతమిది. తరువాత కాలంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు విశాఖ నుంచే ఏర్పడ్డాయి. అంటే ఒకపుడు ఉత్తరాంధ్రా అంతా విశాఖ జిల్లాగానే ఉండేదన్న మాట. ఇక విశాఖ విభజన ఏపీలో ఇప్పటికీ పెద్ద జిల్లావే. విశాఖలో మొదటి నుంచి ప్రభుత్వ కార్యాలయాలు ఉ న్నాయి. అలాగే పారిశ్రామిక విస్తరణ జరిగిన తరువాత అనేక ఇతర పరిశ్రమలు కూడా వచ్చాయి. ఇక విశాఖలో నలభయేళ్ల క్రితం వరకూ జనాభా గట్టిగా అయిదారు లక్షలు మాత్రమే. కార్పోరేషన్ గా ఏర్పడింది కూడా ఆనాడే. విశాఖలో ప్రభుత్వ భూములకు కొదవ లేదు అన్న మాట కొన్ని దశాబ్దాల క్రితం ఉండేది. ఏ పరిశ్రమ పెట్టాలన్నా విశాఖ అనుకూలం అనడానికి కూడా విస్తారంగా భూములు, నీరు ఉండడమే కారణం. రెవిన్యూ రికార్డుల లెక్క ప్రకారం చూస్తే వేలాది భూములు విశాఖ నిండా ఉన్నాయని చెబుతారు. అలాంటి విశాఖలో పాతికేళ్ళ నుంచే భూములు మెల్లగా తగ్గిపోవడం మొదలయ్యాయి. విశాఖ కూడా ఆ సమయం ఉంచే అభివృద్ధిలో పరుగులు తీస్తూ సాగుతోంది. దాంతో భవిష్యత్తుని నాడే చూసిన జాగ్రత్తపరులు హిరణ్యాక్షుడి తరహాలో విశాఖ భూములను చాప చుట్టేసారు అన్న ఆరోపణలు ఉన్నాయి. విశాఖలో రాజకీయ పరిణామాలు కూడా మూడు దశాబ్దాల నుంచి మారిపోయాయి. స్థానికులు కాకుండా ఇతర ప్రాంతాల వారు రావడంతో వారికి ఉన్న ముందు చూపుతో పాటు, వ్యాపార ఆలోచనలు కలగలిపి విశాఖ భూములకు రెక్కలు వచ్చేలా చేశాయని చెబుతారు. ఇక గత రెండు దశాబ్దాలుగా చూసుకుంటే విశాఖ జిల్లాలో భూ కబ్జాలకు గురి కాని ప్రాంతం లేదనే చెబుతారు. దీని మీద వారూ వీరూ అన్న తేడా లేకుండా ఎవరికి పలుకుబడి ఉంటే వారే పెత్తందార్లు అయిపోయారు అన్నది కూడా ఉంది. దాంతో విశాఖలో ప్రభుత్వ భూములన్నీ కూడా హాంఫట్ అన్నట్లుగా మాయం అయిపోయాయి. ఇక తెలుగుదేశం గత అయిదేళ్ల పాలనలో విశాఖలో పెద్ద ఎత్తున భూ దందా సాగిందన్న ఆరోపణలు ఉన్నాయి. సాక్షాత్తూ చంద్రబాబు మంత్రివర్గ సహచరుడు అయ్యన్నపాత్రుడే విశాఖలో పెద్ద ఎత్తున భూములు కబ్జా అయ్యాయని సంచలన అరోపణలు చేశారు. ఇక విపక్షాలు అన్నీ కలసి ఆందోళను చేసిన మీదట చంద్రబాబు సర్కార్ సిట్ ని ఏర్పాటు చేసి దర్యాప్తు జరిపించింది. ఆ నివేదిక బయటపెట్టకుండానే బాబు గద్దె దిగారు, ఇపుడు వైసీపీ సర్కార్ కొత్తగా సిట్ ని ఏర్పాటు చేసింది. దీని నివేదిక ఇంకా రాలేదు కానీ విశాఖలో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటామని మంత్రులు అవంతి శ్రీనివాసరావు, కన్నబాబు చెబుతున్నారు. ఇక నాడు భూకబ్జా జరిగిందని ఒప్పుకున్న టీడీపీ ఇపుడు ప్లేట్ ఫిరాయించడమేంటి అని వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.

## విశాఖలో భారీ పెట్టుబడుల సదస్సు..

విశాఖపట్టణం, జూన్ 23, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దావోస్ వెళ్లి అదానీ, గ్రీన్ కో లాంటి కంపెనీలతో ఎంవోయూలు చేసుకున్నారు. దీనిపై సెటైర్లు పడినా లెక్క చేయలేదు. ఇప్పుడు వారితో ఏపీలో కూడా ఒప్పందాలు చేసుకోకపోతే ఏం బాగుంటుందని అనుకుంటున్నారేమో కానీ విశాఖలో పెట్టుబడుల సదస్సు పెట్టాలని అనుకుంటున్నారు. గతంలోనే .. గౌతంరెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఈ ఆలోచన చేసినా కార్యరూపంలోకి దాల్చలేదు. ఇప్పుడు ముఖ్యమంత్రి మరోసారి పెట్టుబడుల సదస్సు గురించి ఆలోచన చేస్తున్నారు. త్వరలో ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. గత ప్రభుత్వం ప్రతీ ఏడాది పెట్టుబడుల సదస్సు నిర్వహించేది. విశాఖ వేదికగా జరిగే ఈ సదస్సుకు దిగ్గజ పారిశ్రామికవేత్తలందరూ వచ్చే వారు. నచ్చిన వారు ఎంవోయూ చేసుకునేవారు. తర్వాత అధికారులు ఫాలో అప్ చేసుకుని పెట్టుబడులనుతీసుకు వచ్చేవారు. అలా ఎంవోయూ చేసుకున్న వారిలో సగం పరిశ్రమలు వచ్చినా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభించేది. అనూహ్యంగా వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత .. ఎంవోయూ చేసుకున్న వాళ్లని.. ప్రాథమికంగా అనుమతులు పూర్తయిన వాళ్లని వెళ్లగొట్టారు. కొత్త పరిశ్రమలు తీసుకు రాలేదు. గత మూడేళ్లలో ఏపీలో పెట్టుబడులు పెడతామని వచ్చిన వారు ఒక్కరంటే ఒక్కరూ పెట్టుబడులు పెట్టలేదు. కొన్ని కంపెనీలు దమ్మీ కంపెనీలుగా తేలాయి. మరికొన్ని ఇంత వరకూ పనులు ప్రారంభించలేదు. అయితే ఏపీలో వ్యాపారం చే?యలనుకుంటున్న? కార్యకలాపాలు నిర్వహించాలనుకుంటున్న కంపెనీలు? సొంతంగా ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం జోలికి వెళ్లడం లేదు. ఇప్పుడు పెట్టుబడుల సదస్సు నిర్వహించి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకు వస్తున్నట్లుగా ఎంవోయూలు చేసుకోవాలన్న ఆలోచన ప్రభుత్వానికి కలిగినట్లుగా ఉంది.

# కృష్ణా, గుంటూరుపై ప్రత్యేక శ్రద్ధ

విజయవాడ, జూన్ 23,టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మరింత దూకుడు పెంచారు. వరుసగా జిల్లాల పర్యటనకు ప్లాన్ చేస్తున్నారు. తాజాగా, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో చంద్రబాబు పర్యటనకు టీడీపీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఈనెల 29న గుడివాడలో పర్యటించనున్నారు టీడీపీ అధినేత చంద్రబాబు. అక్కడ నిర్వహించే మినీ మహానాడులో టీడీపీ అధినేత పాల్గొంటారని పార్టీ నేతలు చెబుతున్నారు. చంద్రబాబు బహిరంగ సభకు స్థలాలను కూడా మాజీమంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. గుడ్లవల్లేరు, గుడివాడ మండలాల్లో నాలుగు ప్రాంతాలను రవీంద్ర పరిశీలించారు. లక్షలాది మందితో గుడివాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. చంద్రబాబు బహిరంగ సభలో స్వచ్ఛందంగా పాల్గొనేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీమంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. 30న మచిలీపట్నంలోని ఓ కళ్యాణ మండపంలో కృష్ణా జిల్లా టీడీపీ నాయకులతో చంద్రబాబు సమావేశం అవుతారని తెలుస్తోంది. అటు గుంటూరు జిల్లాలోనూ పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నారు తెలుగుదేశం నేతలు. జూలై 1న ప్రత్తిపాడులో, పొన్నూరులో చంద్రబాబు పర్యటన ఉంటుందని తెలుస్తోంది. ప్రజల భవిష్యత్‌కు భరోసా కల్పించేలా చంద్రబాబు జిల్లాల పర్యటన ఉంటుందని టీడీపీ వర్గాలు వెల్లడించాయి. ఏడాది పాటు 100కు పైగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తానని గతంలోనే ప్రకటించారు చంద్రబాబు. ఈ నేపథ్యంలోనే కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పర్యటించనున్నారు. వీటి తర్వాత ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాలు లేదా, రాయలసీమ జిల్లాల్లో చంద్రబాబు పర్యటన ఉండనున్నట్టు సమాచారం. జిల్లాల పర్యటనలు, పార్టీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ వ్యవహారాలు సమాంతరంగా సాగేలా చంద్రబాబు షెడ్యూల్‌ను రూపొందించారు టీడీపీ నేతలు. గుడివాడ గడ్డ నుంచే చాలెంజ్‌తెలుగుదేశం పార్టీ గుడివాడ నడిబొడ్డున మహానాడు నిర్వహించాలని నిర్ణయించింది. ఎన్టీఆర్ కృష్ణా జిల్లా మహానాడును నెలాఖరులో గుడివాడలో ఖరారు చేశారు. రెండు రోజుల పాటు చంద్రబాబు ఆ జిల్లాలోనే బస చేసి పార్టీని ఎన్నికలకు సన్నద్ధం చేయబోతున్నారు. గుడివాడలోనే మహానాడు పెట్టాలని నిర్ణయించడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. కొడాలి నాని విషయంలో టీడీపీ క్యాడర్ అసహనంతో ఉన్నారు. చంద్రబాబుతో పాటు ఎన్టీఆర్ కుటుంబసభ్యులపై ఇష్టారీతిన తిట్లతో విరుచుకుపడే వంశీకి ఈ సారి బుద్ధి చెప్పాలన్న లక్ష్యంతో ఎక్కువ మంది ఉన్నారు. అయితే గుడివాడలో సరైన అభ్యర్థి లేకుండా పోయారు. రావి కుటుంబం నుంచి మార్చి కొడాలి నానికి చంద్రబాబు చాన్సు ఇచ్చిన తర్వాత టీడీపీ తరపున రెండు సార్లుఆయన గెలిచారు. కొడాలి దెబ్బకు రావి కుటుంబం రాజకీయంగా సైలెంట్ అయిపోయింది. కొడాలి పార్టీ మారిన తర్వాత రావి వెంకటేశ్వరరావు తెరపైకి వచ్చారు. ఆయన ఓ సారి నిలబడి ఓడిపోయారు. గత ఎన్నికల్లో దేవినేని అవినాష్‌కు టీడీపీ చాన్సిచ్చింది. అయితే ఆయన కూడా ఓడిపోయారు. ఇప్పుడు మళ్లీ రావి కుటుంబానికే చాన్సివ్వాలని టీడీపీ నాయకత్వం భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. గుడివాడలో ఉన్న పరిస్థితుల కారణంగా అక్కడే మహానాడు పెట్టి .. భయపడేది లేదని ప్రతీ దానికి బదులు చెల్లిస్తామని హెచ్చరికలు పంపితేనే క్యాడర్‌లో కదలిక వస్తుందని టీడీపీ భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. అందుకే మహానాడును గుడివాడలో ఖరారు చేశారు. రెండు రోజుల పాటు చంద్రబాబు అక్కడే ఉండి? గుడివాడ అభ్యర్థిపై క్లారిటీ ఇవ్వడంతో పాటు వ్యూహాలను ఖరారు చేసే అవకాశం ఉంది.

## ట్రాక్టర్లు, ట్రాన్స్ఫారాలు పంపిణి చేసిన ఎమ్మెల్యే మద్దిశెట్టి



దర్శి ప్రకాశం జిల్లా దర్శి శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ దర్శి గడియారం స్థంభం సెంటర్ లో దర్శి నియోజకవర్గం లో ఐదు మండలాలు రైతులకు వైఎస్సార్ యంత్ర సేవా పథకం క్రింద 32ట్రాక్టర్లు జెండా ఊపి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేణుగోపాల్ ట్రాక్టర్ నడిపి వైసీపీ నాయకులు ను ఉత్సాహ పరిచారు. తదుపరి రైతులు కు 500 విద్యుత్ ట్రాన్సురాలు జెండా ఊపి పంపిణి చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడు తూ దర్శి నియోజకవర్గం లో మొదటి విడతగా 32 ట్రాక్టర్లు,500 విద్యుత్ ట్రాన్ఫరాలు పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ అధికారులు ఏడి అర్జున్ నాయక్, దర్శి మండలం వ్యవసాయ ఆదికారి బాలకృష్ణ నాయక్ తో పాటు కురిచేడు, దొనకొండ, ముండ్లమూరు, తాళ్లూరు మండలం వ్యవసాయ అధికారులు, మరియు ఐదు మండలాల విధ్యుత్ అధికారులు,దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు, కురిచేడు, దొనకొండ మండలాల ఎంపీపీలు ,జడ్పీటీటీసీ లు,వైసీపీ ఇతర నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సేమ్ 2 సేమ్

### బుక్ మై షో కాపీయేనా

విజయవాడ, జూన్ 23,,(న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సినిమా టిక్కెట్లను ఆన్‌లైన్‌లో అమ్మేందుకు యువర్ స్క్రీన్స్ పేరుతో పోర్టల్ లాంఛ్ చేస్తున్నట్లుగా ప్రకటించింది. ఇందులో సినిమా టిక్కెట్లు తక్కువ ధరకే లభిస్తాయని ఏపీఎస్ఎఫ్‌డీసీ ఎండీ విజయ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. సినిమా టిక్కెట్ల ధరలను ప్రభుత్వమే నిర్దేశిస్తుందని.. అదే సమయంలో ఇతర టిక్కెట్ పోర్టళ్లలో తీసుకునే సర్వీస్ చార్జీని తాము వసు?లు చేయబోమని చెబుతున్నారు. అంటే.. బుక్ మై షో లాంటి యాప్స్ లో కూడా టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు. వాటితో పాటు ప్రభుత్వ టిక్కెటింగ్ యాప్‌ను అందుబాటులోకి తెస్తారన్న మాట. ఒక్క ప్రభుత్వమే ఆన్ లైన్ టిక్కెట్లు అమ్మడం చట్ట విరుద్ధమయ్యే ?వకాశం ఉండటంతో ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లుగా తెలుస్తోంది. ఇతర పోర్టల్ లలో టికెట్ బుకింగ్ చేసుకుంటే టికెట్ పై అదనంగా రూ. 20 నుండి రూ. 25 వరకు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని.. యువర్ స్క్రీన్స్ యాప్‌లో కేవలం కేవలం 1.95 శాతం మాత్రమే వసూలు చేస్తామని ప్రభుత్వం చెప్పింది. అంటే సున్నా శాతమని విజయ్ కుమార్ రెడ్డి తన ప్రకటనలో చెప్పారు కానీ? దాదాపుగా రెండు శాతం స్పష్టంగా కనబడుతూంటే.. సున్నా శాతం ఎట్లా అవుతుందో వైసీపీ లెక్కల మాస్టార్లకే తెలియాలి. ఆ లెక్కన ఒక్కో టికెట్ పై ప్రేక్షకుడికి సుమారు రూ. 25 భారం తగ్గుతుందని ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుతం ఉన్న ఆన్ లైన్ పోర్టల్ లతో థియేటర్లకు ఒప్పందాలు ఉన్నాయి. ఈ ఒప్పందాలు కొనసాగుతాయి. అయితే ప్రభుత్వ ఎగ్జిస్టింగ్ జీవో ప్రకారం కేవలం 50 శాతం సీట్లు మాత్రమే ఆన్ లైన్ లో బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని ప్రభుత్వం గుర్తు చేసింది. అదే యువర్ స్క్రీన్స్‌లో అయితే వంద శాతం బుక్ చేసుకోవచ్చు. థియేటర్ల వారికి తమ డబ్బు తమకు సక్రమంగా రాదనే అపోహలు అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుతం ఉన్న ఆన్ లైన్ పోర్టల్ లతో పాటు ప్రభుత్వం తీసుకువచ్చిన యువర్ స్క్రీన్స్ ద్వారా కూడా ప్రేక్షకులు టికెట్ బుక్ చేసుకునే అవకాశం థియేటర్లు కల్పించాలని అవసరమైన హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్ లను కూడా ప్రభుత్వమే అందిస్తుంగని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొత్తంగా ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం చూస్తే? బుక్ మై షో తరహాలో ప్రభుత్వం యాప్ రిలీజ్ చేస్తోంది. తాను రెండు శాతం కమిషన్ తీసుకుంటోంది. అయితే ఇచాలా వరకూ ప్రభుత్వం చెప్పేదానికి చేసేదానికి పొంతన ఉండదు. అందుకే.. ప్రభుత్వం .. గుత్తాధిపత్యం కోసం ఏదో ఓ ప్రయత్నం చేస్తుందని.. ఎంవోయూలు చేసుకోవడం లేదన్న కారణంగాఈ ప్రకటన ఇచ్చిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# పాఠశాలల్లో స్వచ్ఛత, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి




కడప స్వచ్ఛ విద్యాలయ పురస్కార జిల్లాస్థాయి అవార్డుల ప్రధానోత్సవంలో జిల్లా కలెక్టర్ విజయరామరాజుఆరు అంశాల్లో 38 పాఠశాలలు స్వచ్ఛ విద్యాలయ పురష్కరాలకు ఎంపిక చేశారు ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వచ్ఛతతో పాటు క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని.. జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ విసి హాలులో.. సమగ్రశిక్ష ప్రాజెక్టు ఆధ్వర్యంలో.. జరిగిన "జిల్లా స్థాయిలో స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ అవార్డు ప్రదానోత్సవం" కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయరామరాజు అన్నారు జిల్లా వ్యాప్తంగా 3969 పాఠశాలకు సంబంధించి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు నమోదు చేసుకోగా..ఇందులో ప్రధానంగా ఆరు రకాల అంశాల ద్వారా ఆయా పాఠశాలను స్వచ్ఛ విద్యాలయ పురష్కరాలకు 38 పాఠశాలలు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇందులో ఆరు రకాల అంశాలకు సంబంధించి మంచి నాణ్యత ప్రమాణాలు కలిగి ఉండి 8 పాఠశాలలను అన్ని కేటగిరిలో ప్రగతి సాధించిన పాఠశాలగా గుర్తించడం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేక కమిటీ ద్వారా స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ అవార్డుకు సంబంధించి ఈ పాఠశాలను సంబందిత కమిటీ నిశితంగా పరిశీలించి అవార్డులకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఒక్కొక్క క్యాటగిరికి ఐదు పాఠశాలల చొప్పున 30 పాఠశాలను ఎంపిక చేసి.. మొత్తంగా వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా 38 పాఠశాలలో స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. వాటికి సంబంధించిన ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సభ్యులను దీనికి సంబంధించి మూల్యాంకనంలో ప్రముఖ పాత్ర వహించిన క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, వీరందరికీ జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మోమెంటో, ప్రశంసాపత్రాలను జిల్లా కలెక్టర్ అందజేశారు. ప్రతి పాఠశాల



స్వచ్ఛంగా ఉండాలని అదేవిధంగా పిల్లలు చదువుకోవడానికి మంచి వసతులు ఉండేవిధంగా వాటిని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులు పరివర్తనలో మార్పు రావాలని క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థుల యొక్క భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందని.. గురువులుగా మీ పాత్ర అత్యంత కీలక పాత్ర కీలకం అన్నారు. ఉపాధ్యాయులు కఠినంగా ఉంటేనే.. విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ నైతిక విలువలు పెంపొందుతాయన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను భవిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. రానున్న కాలంలో అన్ని పాఠశాలలు స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ అవార్డు కి అర్హత సాధించాలని ఆ దిశగా ప్రతిఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని ఉపాధ్యాయులును ఉద్దేశించి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేష్, జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి, జిల్లా మెడికల్ అధికారి నాగరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చెన్నకేశవరెడ్డి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ గంగిరెడ్డి, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పాలెం రాజా, భాస్కర్ ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దర్శి లో సిమెంట్ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే



దర్శి ప్రకాశం జిల్లా దర్శి లో దర్శి శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ దర్శి నగర పంచాయతీ పరిధి లోని అద్దంకి రోడ్డు లో 16.95 లక్షలు రూపాయలు తో సిమెంట్ రోడ్డు ప్రారంభించారు. తదుపరి ఎమ్మెల్యే వేణుగోపాల్ 12 వ వార్డ్ పుట్ట బజార్ లో29.40 లక్షలు రూపాయలు తో కాలువ నిర్మాణం, అంతర్గత సిమెంట్ రోడ్లు ప్రారంభం చేశారు. తదుపరి 14వ వార్డ్ శివరాజ్ నగర్ లో 17లక్షలు రూపాయలు తో సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మాణం పనులు ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమం లో ప్రభుత్వ అధికారులు, దర్శి ఎంపీపీ, వైస్ ఎంపీపీ లు,దర్శి ఏఎమ్ సి చైర్మన్, మాజీ చైర్మన్,వైసీపీ నాయకులు వై వి సుబ్బయ్య, అంజిరెడ్డి, తిరుపతి రెడ్డి,కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రిమ్స్ పోలీసుస్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ కె కె అన్బురాజన్

కడప రిమ్స్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ కే.కే.ఎన్ అన్బు రాజన్ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పరిసరాలను పరిశీలించారు. ఆవరణలో పచ్చదనం పెంపొందించాలని, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని రిమ్స్ సి.ఐ సదాశివయ్య ను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు.. అనంతరం పోలీస్ స్టేషన్ లోని రికార్డులను పరిశీలించారు... దొంగతనాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని, నాటుసారా, అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణా, నిషేధిత గుట్కా పై దాడులు ముమ్మరం చేయాలని ఆదేశించారు మహిళల భద్రత కు పోలీస్ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన 'దిశ' యాప్ పై అవగాహన కల్పించి డౌన్లోడ్ చేసుకోవడంతో పాటు రిజిస్టర్డ్ యూజర్ గా నమోదు చేసుకునేలా వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నియంత్రణ కు చర్యలు తీసుకోవాలని, వాహనదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని రిమ్స్ సి.ఐ సదాశివయ్య కు సూచించారు.



# రైతు భరోసా కేంద్రాల ఆకస్మిక తనిఖీ

బద్వేలు బద్వేల్ డివిజన్ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి ఏ. నాగేశ్వర రావు గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా ఖరీఫ్ సీజన్లో సాగు చేయబోయే పంటలకు సంబంధించి సూక్ష్మ ప్రణాళిక తయారు చేసుకోవాలని ,అదేవిధంగా ప్రభుత్వం అందించే విత్తనాలు, ఎరువులు, డ్రిప్పు పరికరాలను మరియు ఇతర సబ్సిడీ పథకాలను రైతులకు లబ్ధి చేకూరేలా చేయాలని తెలియజేశారు. ప్రస్తుత సీజన్లో రైతులకు కావాల్సిన ఎరువులు ,విత్తనాలు జిల్లాలో సమృద్ధిగా ఉన్నాయని కావున రైతులు తమకు కావాల్సిన ఎరువుల కొరకు రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లిన ఎడల ఎంఆర్పి ధరలకే అంద చేయబడతాయని, కావున రైతులు ఈ అవకాశాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. రైతులు కొనుగోలు చేసే ఎరువులు పురుగు మందులు విత్తనాల కు సంబంధించి రసీదులు తప్పకుండా పొందాలని, నాణ్యతలోపం కలిగిన విత్తనాలు, ఎరువులు అమ్మే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అంతేకాక ప్రభుత్వం అందించే ప్రతి రూపాయి కూడా రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా గా తోడ్పడాలని మరియు అన్ని పథకాల యొక్క జాబితాలను సోషల్ ఆడిట్ కొరకు రైతు భరోసా కేంద్రాల్లో, గ్రామ సచివాలయం మరియు ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలలో లో అందుబాటులో ఉంచాలని, రైతులకు కు వచ్చి చిన్న సమస్యలు కూడా స్పందించి తదుపరి చర్యలను చేపట్టాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గోపవరం ,వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఆగివున్న లారీని ఢీ కొన్న కారు.ఒకరు మృతి,ఆరుగురికి గాయాలు

చిత్తూరు ఆగివున్న లారీని ఒక కారు ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఆరుగురికి గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదం నాయుడుపేట-పూతలపట్టు ప్రధాన రహదారిలోని టి. రంగంపేట క్రాస్ సమీపంలో చోటు చేసుకుంది. తిరుపతి నుండి బెంగళూరు కి వెళ్తున్న కారు ఆగి ఉన్న లారీని ఢీ కొనడంతో గురువారం తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. మృతురాలు రామచంద్రపురం మండలం,దుర్గ సముద్రం కు చెందిన వరలక్ష్మి పోలీసులు గుర్తించారు. క్షతగాత్రులు కోదండరామిరెడ్డి, సుబ్రహ్మణ్యం లతోపాటు మరో నలుగురిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూతలపట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వల్లూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

అచంట అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతూ ప్రతీ పేదవాడికి అండగా నిలుస్తున్న సీఎం జగన్, వారి గుండెల్లో నిలిచిపోయారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకు వాడ శ్రీ రంగనాథరాజు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం వల్లూరులో గడపగడపకూ మన ప్రభుత్వంలో పాల్గొని సంక్షేమ పథకాల లబ్దిదారులను లబ్దిదారులకు వివరించారు. గ్రామంలోని సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ ముందుకు సాగారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను విప్లవంలా అమలు చేస్తుండడంతో పేదల ఇళ్లల్లో వెలుగులు నిండాయన్నారు. కరోనా సమయంలోనూ ఇబ్బందులు పడకుండా సంక్షేమాన్ని అందించడంతో ఎందరో పేదలు ఇబ్బందుల నుంచి గట్టెక్కారన్నారు. దానితో ప్రతిపక్షాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయన్నారు. దుష్ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాయన్నారు. అయినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా సీఎం జగన్కు ఎదురునిలిచే వారు లేరన్నారు. సీఎం జగన్ మరోసారి విజయం సాధించడం ఖాయ మన్నారు. మరింత సం క్షేమం అందించడానికి ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే సీఎం ఆదేశాల మేరకు గడపగడపకు మన ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## విశాఖ తూర్పు లో వైకాపా ప్లీనరీ సన్నాహక కార్యక్రమం

విశాఖపట్నం వైసీపీ అధిష్టానం రెండు రోజుల పాటు నిర్వహించే ప్లీనరీ సమావేశాలకు నియోజకవర్గాల వారీగా శ్రేణులు సన్నద్ధమవుతునారు. వచ్చే నెల 8,9 తేదీలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలు విజయవాడలో జరుగుతున్న నేపథ్యంలో ప్లీనరీ సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా విశాఖ తూర్పు నియోజకవర్గం ప్లీనరీ సమావేశం వుడా చిల్డ్రన్ థియేటర్ లో ఘనంగా నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త విజయనిర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈసమావేశానికి తూర్పు నియోజకవర్గం నుండి కార్పొరేటర్లు వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు అభిమానులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో హాజరైన విశాఖ నగర మేయర్ హరి వెంకట కుమారి, ప్లీనరీ నిర్వాహకురాలు అక్రమాన్ని విజయనిర్మల మాట్లాడుతూ ... ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు ఇప్పటికే 95 శాతం నెరవేర్చాలని,ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ కొనసాగిస్తున్నారని అన్నారు.

## గ్రామాల్లో జిల్లా పంచాయితీ అధికారి తనిఖీలు...

బెల్లంపల్లి జూన్ 23 బెల్లంపల్లి మండలం దుగ్నేపల్లి గ్రామంలో గురువారం జిల్లా పంచాయితీ అధికారి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గ్రామంలో మురికి నీటి కాలువలు, గ్రామంలో చెత్త చెదారం పై తనిఖీలు నిర్వహించారు. గ్రామ పంచాయితీ పరిధిలో రోడ్ల కు ఇరువైపులా చెట్లు నాటాలని, చెత్తను, డంపింగ్ యార్డుకు తరలించాలని, ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో మంచినీటి మంచి నీటి ట్యాంకులు

ఎప్పటికప్పుడు పరిశుభ్ర పంచాలని, గ్రామంలో పచ్చ ధనం పరిశుభ్రత పాటిస్తే, వ్యాధులు అరికట్టవచ్చని, అందుకోసం శానిటేషన్ పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు...అనంతరం లంబాడి తాండా గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అపరిశుభ్రంగా ఉన్న షాప్ యజమానులకు 11000 జరిమానా విధించారు. గురిజాల గ్రామంలోని మధుర వైన్ షాప్ పరిసరాల్లో ప్లాస్టిక్ తో ఆపరిశుభ్రంగాఉండడంతో మధుర వైన్ షాప్ యజమానికి 20000 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

### మూడు ప్రాంతాల్లో 29 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

శేషాచలం అటవీ పరిధి లోని పులిబోను, అన్నదమ్ముల బండ, బొమ్మాజీ కొండ పరిసర ప్రాంతాల్లో 29 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఎస్పీ మేడా సుందరరావు తెలిపారు. డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో, ఆర్ ఐ సురేష్ కుమార్ రెడ్డి కి చెందిన మూడ్ టీమ్ లు శేషాచలం కొండల్లో కూంబింగ్ చేపట్టాయి. గురువారం ఉదయం వివిధ సమయాల్లో పులిబోను సమీపంలోని గుండాల కోన వద్ద 11 , అన్నదమ్ముల బండ వద్ద 12, బొమ్మాజి కొండ వద్ద 6 ఎర్రచందనం దుంగలు లభించాయని తెలిపారు. అయితే స్మగ్లర్లు పారిపోయినట్లు తెలిపారు. మొత్తం 29 దుంగలు 598 కిలోలు బరువుండగా, విలువ రూ. 25 లక్షలని తెలిపారు.

# ప్రపంచ శాంతి కోసం క్రీడలు వర్ధిల్లాలి




## ఒలింపిక్ డే రన్ సంబరాల్లో నగర మేయర్ బి వై రామయ్య



కర్నూలు (నేటి గళం) జూన్ 23 -: యుద్ధ ఉన్మాదాన్ని విడనాడి ప్రపంచశాంతి కోసం క్రీడలు వర్ధిల్లాలని ప్రాచీన , ఆధునిక ఒలంపిక్ ఉద్దేశాన్ని చాటి చెప్పేదే అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవ ప్రత్యేకత అని కర్నూలు నగర మేయర్ బి వై రామయ్య తెలిపారు. ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ చైర్మన్గా కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి కన్వీనర్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని రెండు ప్రాంతాల నుండి ఒలంపిక్ రన్ ప్రారంభమయ్యింది. బి క్యాంప్ నుండి రాజవిహార్ వరకు ఓ క్రీడా జ్యోతి, కర్నూలు అవుట్ డోర్ స్టేడియం నుండి రాజవిహార్ వరకు మరో క్రీడాజ్యోతి తో వందలాది మంది క్రీడాకారులు పాల్గొనగా ఉత్సాహభరితంగా నగర పురవీధుల్లో ఒలంపిక్ పరుగు కొనసాగింది. అనంతరం రెండు క్రీడాజ్యోతుల తో నగర మేయర్ బి వై రామయ్య, మాజీ శాసనసభ్యులు ఎస్వీ మోహన్ రెడ్డి పాల్గొనగా , పరుగు అవుట్డోర్ స్టేడియానికి చేరుకునీ అక్కడ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె ఇ ప్రభాకర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నగర మేయర్ మాట్లాడుతూ.. క్రీడలతో శాంతి, స్నేహభావం వివిధ వర్గాల ప్రజల మధ్య అవినాభావ సంబంధాలు ఏర్పడాలన్నారు .అసూయ, కోపం, పగా వంటి దుర్గుణాలను విడనాడి.. క్రీడల్లో స్వేచ్ఛగా పాల్గొన్న ప్పుడే ప్రపంచ శాంతి సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు ఎస్వీ మోహన్రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా క్రీడా అభివృద్ధిని కాంక్షించే దాతలు కర్నూలు నగరంలో ఉండడం క్రీడ అభివృద్ధికి దోహదం అవుతుందని తెలిపారు. కర్నూలు క్రీడా కేంద్రంగా జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించడం లో మేటి అని ఆయన కొనియాడారు. ఎమ్మెల్సీ కే.ఇ.ప్రభాకర్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక వికాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవచ్చు తద్వారా అనేక శారీరక రుగ్మతలను దూరం చేయవచ్చాన్నరు. నగరంలోని జోలపురం సమీపంలో అవుట్డోర్ స్టేడియం ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని నగర మేయర్ ను కోరారు. కార్యక్రమంలో చిన్నటేకూరు ఏపీ రెసిడెన్షియల్ విద్యార్థులు నిర్వహించిన పిరమిడ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఒలంపిక్ డే సంబరాల్లో భాగంగా వారం రోజుల పాటు నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు ఒలంపిక్ సంఘం సభ్యులు బొల్లవరం రామాంజనేయులు నేతృత్వంలో ముఖ్య అతిథులు విజేతలకు మెడల్స్ తో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు హర్షవర్ధన్, రాజశేఖర్, పాపా, గంగాధర్ ,పోతురాజు విజయ్ కుమార్, శ్రీనివాసులు, సునీల్ కుమార్, చిట్టి బాబు, దాసరి సుధీర్, అవినాష్ మట్టి, ,పాల్, కోలా ప్రతాప్, నభి సాహెబ్ ,వెంకటేశ్వర్లు, ఉష శ్రీనివాసులు ,మాస్టర్ శోభన్ బాబు, రైఫిల్ షూటింగ్ భాష ,రవికుమార్ ,వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష ,కార్యదర్శులు జోసఫ్ లక్ష్మయ్య, ఎం .వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు జిల్లా నూతన ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఐపియస్



కర్నూలుజూన్ 23 -: కర్నూలు జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సిద్ధార్థ్ కౌశల్ ఐపియస్ , బాధ్యతల స్వీకరణ అనంతరం గురువారం కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్ ఐపియస్ ని కర్నూలు రేంజ్ డిఐజి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

# కర్నూలు జిల్లాలో రూ. 689 కోట్లతో ఆర్ అండ్ బి రోడ్లు, భవనాల నిర్మాణం




## రూ.385 కోట్లతో పంచాయతీ రాజ్ రోడ్ల నిర్మాణం నిర్మాణాల పనులు నాణ్యతతో చేపట్టాలి-:కర్నూలు జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు

కర్నూలు జూన్ 23 -: కర్నూలు జిల్లాలో రూ. 689 కోట్ల వ్యయంతో వివిధ పథకాల కింద చేపడుతున్న ఆర్ అండ్ బి రోడ్లు, భవనాల నిర్మాణాలను నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలని, నిర్మాణాల పనులను నాణ్యతతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో పంచాయతీరాజ్,ఆర్ అండ్ బి శాఖల ద్వారా చేపడుతున్న రోడ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ అండ్ బి రోడ్ల నిర్మాణం లో భాగంగా జిల్లాలో బ్యాంక్ రుణం నిధులు రూ.80 కోట్ల తో 324 కిలో మీటర్లలో 46 పనులు జరుగుతున్నాయని, ఇందులో 26 పనులు పూర్తయ్యాయన్నారు.. మరో 8 పనులు పురోగతిలో ఉన్నాయని, వీటిని పది రోజుల్లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంకా ప్రారంభం కాని 12 పనులను వెంటనే మొదలు పెట్టి జూలై నెలాఖరు లోపు, వర్షాలు వచ్చే లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.తుంగభద్ర నదిపై నాగుల దిన్నె వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జిని మరో మూడు నెలల లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి చొరవతో తెలంగాణ లో రెండు ఎకరాలు భూసేకరణ చేసి ఎంతో కాలంగా పెండింగ్ ఉన్న సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు.గత ప్రభుత్వం లో పెండింగ్ లో ఉన్న రూ.4 కోట్లను మంజూరు చేసి కాంట్రాక్టర్ కు చెల్లించేలా మంత్రి చర్యలు తీసుకున్నారని కలెక్టర్ వివరించారు..ఆర్ అండ్ బి ద్వారా రూ 7.50 కోట్లతో జిల్లాలో హుసేనాపురం పెద్ద హరివాణం, మొలగవల్లి, బదినేహల్ గ్రామాల్లో 4 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను కొత్తగా నిర్మించడం జరుగుతోందన్నారు.. ఇది 70 శాతం పూర్తయ్యాయని, ఆగస్టు లోపల 100% పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి రూ. 15 కోట్లతో 30 మరమ్మత్తుల పనులు జరుగుతున్నాయని, వీటిలో 25 పనులు పూర్తయ్యాయని, మిగిలిన 5 పనులు 80 శాతం కాగా, జూలై 15 లోపు వీటిని పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు..రూ.35 కోట్లతో నిర్మించిన కర్నూల్ ఆర్వోబి పూర్తయి, ప్రారంభానికి సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు..రూ. 12 కోట్లతో 8 కిలోమీటర్ల పొడవున చేపడుతున్న వెల్దుర్తి- రామళ్లకోట సింగిల్ రోడ్ నుండి డబల్ రోడ్డు గా చేస్తున్న పనులు 50 శాతం పూర్తయ్యాయని, వీటిని వేగవంతం చేసి జూలై నెలాఖరు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.రూ. 6.7 కోట్లతో పుల్లారెడ్డి కాలేజ్ నుంచి పసుపుల, సూదిరెడ్డి పల్లి మీదుగా వెంకాయ పల్లి వరకు 4.8 కిలోమీటర్ల పొడవున చేపడుతున్న సింగిల్ రోడ్ నుంచి డబల్ రోడ్డు గా చేస్తున్న పనులు 30 శాతం పూర్తయ్యాయి, వీటిని వేగవంతం చేసి ఆగస్టు నెలాఖరులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.రూ.15 కోట్లతో ఆదోని లో చేపడుతున్న 6 కోర్ట్ భవనాల నిర్మాణాల పనులు ప్రస్తుతం పునాది స్థాయిలో ఉన్నాయని, వీటిని వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లా అంతటా రూ 1.4 కోట్లతో చేపట్టిన ప్యాచ్ వర్క్ పనులతో రోడ్లపై గుంతలు లేకుండా పూడ్చాలని ఆదేశించారు.రూ.385 కోట్లతో పంచాయతీ రాజ్ రోడ్ల నిర్మాణంపంచాయతీరాజ్ శాఖ ద్వారా వివిధ పథకాల కింద రూ. 385 కోట్లతో చేపడుతున్న గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న రోడ్ల నిర్మాణాలను నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు.. ఇందులో భాగంగా 7 నియోజకవర్గాలలో 216 కిలోమీటర్ల పొడవున గుంతలు లేని రోడ్లు గా తీర్చి దిద్దేందుకు 60 పనులను చేపట్టడం జరుగుతోందని, వీటిలో 5 ప్యాకేజీలకు టెండర్లు పూర్తయిందని, మరో నాలుగు ప్యాకేజీల పనులు టెండర్ దశలో ఉన్నాయన్నారు.. టెండర్ ప్రక్రియ పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.నేషనల్ హైవే లో సఫా ఇంజనీరింగ్ కాలేజ్ నుండి గార్గేయపురం వరకు నిర్మించనున్న రింగ్ రోడ్డు, నంద్యాల చెక్పోస్ట్ నుంచి గార్గేయపురం వరకు రోడ్ విస్తీర్ణం కోసం త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలని కలెక్టర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రహదారులు మరియు భవనాల శాఖ ఎస్ఈ సి. శ్రీధర్ రెడ్డి, డిఈ శ్రీనివాసులు, పంచాయతీ రాజ్ ఎస్ ఈ సుబ్రమణ్యం, నేషనల్ హైవేస్, పంచాయతీ రాజ్ శాఖల ఇంజనీర్లు పాల్గొన్నారు.

# మహేష్ రాజమౌళి సినిమా.. ఓ చిన్న అప్డేట్



టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో రూపొంది ఇటీవలే విడుదల అయిన ఆర్ ఆర్ ఆర్ సినిమా హడావుడి ఇంకా కొనసాగుతూనే ఉంది. దేశ వ్యాప్తంగా అత్యధిక వసూళ్లను దక్కించుకుని రికార్డులు బ్రేక్ చేసిన ఆ సినిమా తర్వాత జక్కన్న కాస్త గ్యాప్ తీసుకుని మళ్లీ ఇప్పుడు తదుపరి సినిమా వర్క్ లో పడ్డట్లుగా సమాచారం అందుతోంది. ఇప్పటికే ఆయన తదుపరి సినిమా మహేష్ బాబుతో కన్ఫర్మ్ అయిన విషయం తెల్సిందే.గత కొన్నాళ్లుగా మహేష్ బాబుతో రాజమౌళి సినిమా గురించిన వార్తలు సోషల్ మీడియాలో జోరుగా వస్తున్నాయి. ఎట్టకేలకు వీరి కాంబో మూవీ పట్టాలెక్కుతోంది. రాజమౌళి ప్రస్తుతం తన తండ్రి విజయేంద్ర ప్రసాద్ తో కలిసి స్క్రిప్ట్ వర్క్ మొదలు పెట్టారట. జక్కన్న దాదాపు అన్ని సినిమాలకు కూడా ఆయన తండ్రి విజయేంద్ర ప్రసాద్ కథ ను అందిస్తున్నారు. ఈ సినిమాకు కూడా ఆయనే రచయితగా వ్యవహరించబోతున్నాడు.రాజమౌళి ఇప్పటికే ఒక స్టోరీ లైన్ ను అనుకున్నాడని.. దాన్ని కథ గా మార్చే పనిలో ఉన్నారు. ఆ తర్వాత పూర్తి స్థాయి స్క్రిప్ట్ గా మార్చుతారు. రాజమౌళి తన హీరోలు ఎవరికి అయినా స్క్రిప్ట్ పూర్తిగా చెప్పడు అనే టాక్ ఉంది. మరి మహేష్ బాబుకు అయినా రాజమౌళి పూర్తి కథను చెప్పబోతున్నాడా లేదా అనేది తెలియాల్సి ఉంది.ప్రస్తుతానికి ఈ సినిమా గురించి స్క్రిప్ట్ వర్క్ షురూ చేశారు. స్టోరీ లైన్ రెడీ అయ్యింది అనే అప్డేట్ మాత్రమే అందుతోంది. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ రాజమౌళి టీమ్ నుండి వస్తాయేమో చూడాలి. జక్కన్న రాజమౌళి ఈ సినిమాను వచ్చే ఏడాది ఆరంభంలో పట్టాలెక్కించే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది.ఇక ఈ సినిమాను భారీ యాక్షన్ అడ్వంచర్ మూవీగా దాదాపుగా 500 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కించేందుకు గాను ప్లాన్ చేస్తున్నాడట. ఈ బడ్జెట్ షూటింగ్ మొదలు అయ్యి.. పూర్తి అయ్యేప్పటికి పెరిగినా ఆశ్చర్యం లేదు. జక్కన్న 500 కోట్లు కాదు.. వెయ్యి కోట్లు పెట్టినా వెనక్కు తీసుకు రాగల ధీరుడు అనే అభిప్రాయం ప్రతి ఒక్క నిర్మాతకు ఉంటుంది. అందుకే మహేష్ బాబు సినిమా కు ఆ భారీ బడ్జెట్ రిస్క్ ఏమీ కాదు.మహేష్ బాబు తో ఒక సూపర్ అడ్వంచర్ మూవీని తెరకెక్కించేందుకు రాజమౌళి స్క్రిప్ట్ రెడీ చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. అదే తరహా కథను ఇప్పుడు విజయేంద్ర ప్రసాద్ రెడీ చేసే పనిలో ఉన్నాడనే వార్తలు వస్తున్న నేపథ్యంలో అభిమానులు చాలా హ్యాపీగా ఉన్నారు. ఈ సినిమా అధికారిక ప్రకటన కోసం అంతా వెయిట్ చేస్తున్నారు.

# దళపతి విజయ్ 66 తెలుగు టైటిల్ ఇదే!

దళపతి విజయ్ హీరోగా స్టార్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి డైరెక్షన్ లో ఓ భారీ మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పీవీపీ బ్యానర్ లపై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు శిరీష్ పరమ్ వి పొట్లూరి ఎరల్ వి. పొట్లూరి నిర్మిస్తున్నారు. నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తోంది. తెలుగు తమిళ భాషల్లో ఏక కాలంలో ఈ మూవీని ద్వి భాషా చిత్రంగా తెరకెక్కిస్తున్నారు. మంగళవారం హీరో విజయ్ ఫస్ట్ లుక్ తో పాటు ఈ మూవీ టైటిల్ ని రెండు భాషల్లోనూ చిత్ర బృందం ప్రకటించి విజయ్ ఫ్యాన్స్ ని సర్ ప్రైజ్ చేసింది.ముందు తమిళ టైటిల్ ని 'వారిసు'గా ప్రకటించిన మేకర్స్ ఆ వెంటనే తెలుగు టైటిల్ ని 'వారసుడు' గా ప్రకటించింది. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న మూవీ కావడంతో ఈ మూవీ కథానుసారం 'వారసుడు' టైటిల్ కరెక్ట్ యాప్ట్ కాబట్టి ఇదే టైటిల్ ని ఫైనల్ చేశారు. 'ది బాస్ రిటర్న్స్' అని ట్యాగ్ లైన్. ఫస్ట్ లుక్ పోస్టర్ లో స్టైలిష్ లుక్ లో కనిపిస్తూనే హీరో విజయ్ సీరియస్ గా కనిపిస్తున్న తీరు ఆకట్టుకుంటోంది.దిల్ రాజు బ్యానర్ అంటే ఫ్యామిలీ ఎంటర్ టైనర్ లకు కేరాఫ్ అడ్రస్. ఇదే విషయాన్ని 'వారసుడు' ఫస్ట్ లుక్ పోస్టర్ టైటిల్ మరోసారి రుజువు చేసింది. అత్యంత భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఈ మూవీ టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. 'బీస్ట్' తరువాత విజయ్ నుంచి వస్తున్న సినిమా కావడం తొలి సారి తెలుగు తమిళ భాషల్లో ఏక కాలంలో రూపొందుతున్న మూవీ కావడంతో ఈ మూవీపై విజయ్ ఫ్యాన్స్ తో పాటు సినీ లవర్స్ లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ ఆ అంచనాల్ని మరింతగా పెంచేసింది.విజయ్ కున్న క్రేజ్ ని దృష్టిలో పెట్టుకుని యూనివర్సల్ సబ్జెక్ట్ తో ఈ మూవీని తెరకెక్కిస్తున్నారట. తమిళంలో 'వారిసు'గా తెలుగులో 'వారసుడు'గా రూపొందుతున్న ఈ చిత్రం రెండు భాషల్లోనూ బ్లాక్ బస్టర్ హిట్ ని సొంతం చేసుకోవడం కాయం అని చెబుతున్నారు.ఈ మూవీలో విజయ్ ని నెవర్ బిఫోర్ క్యారెక్టర్ లో దర్శకుడు వంశీ పైడిపల్లి ప్రజెంట్ చేస్తున్నట్టుగా ఫస్ట్ లుక్ తో క్లారిటీ వచ్చేసింది. భారీ నిర్మాణ విలువలతో అత్యంత భారీ తారాగణంతో గ్రాండీయర్ గా ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ప్రభు శరత్ కుమార్ ప్రకాష్ రాజ్ జయసుధ శ్రీకాంత్ కిక్ శ్యామ్ యోగిబాబు సంగీత సంయుక్త కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ చెన్నైలో జరుగుతోంది. ప్రధాన తారగణం పాల్గొనగా కీలకమైన భారీ షెడ్యూల్ ని చిత్రీకరిస్తున్నారు. వంశీ పైడిపల్లి అహిషోర్ సాల్మాన్ హరి ఈ చిత్రానికి కథ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. సంగీతం తమన్ ఫొటోగ్రఫీ కార్తీక్ పళని ఎడిటింగ్ ప్రవీణ్ కె.ఎల్ సహ నిర్మాతలు శ్రీహర్షిత్ రెడ్డి శ్రీహన్షిత సునీల్ బాబు వైష్ణవి రెడ్డి ప్రొడక్షన్ డిజైనర్ లుగా




# సుక్కు శిష్యుడికి సితార ఆఫర్?

స్టార్ డైరెక్టర్ల శిష్యులు చాలా వరకు ఇండస్ట్రీలో దర్శకులుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కొంత మంది సక్సెస్ లు సాధిస్తున్నారు. మరి కొంత మంది బ్లాక్ బస్టర్ హిట్ లని సొంతం చేసుకుని నెక్స్ట్ లెవెల్ కి వెళుతున్నారు. ఈ వరుసలో స్టార్ డైరెక్టర్ సుకుమార్ శిష్యులు ఇప్పుడు ముందు వరుసలో నిలుస్తున్నారు. గత ఏడాది 'ఉప్పెన' సినిమాతో బుచ్చిబాబు సానా బ్లాక్ బస్టర్ హిట్ ని సొంతం చేసుకుని వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే.ఈ మూవీతో వంద కోట్ల క్లబ్ లో చేరిన దర్శకుడిగా రికార్డుని సొంతం చేసుకుని టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిపోయారు. ఈ మూవీ తరువాత బుచ్చిబాబు స్టార్ హీరో యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో ఓ భారీ స్పోర్ట్స్ డ్రామాకు శ్రీకారం చుట్టాలని ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే.ఇదిలా వుంటే సుకుమార్ మరో శిష్యుడు పల్నాటి సూర్య ప్రతాప్ '18 పేజెస్' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. యంగ్ హీరో నిఖిల్ నటించిన ఈ మూవీని జీఏ2 పిక్చర్స్ సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మించారు.విభిన్నమైన కథ కథనాలతో రూపొందిన ఈ మూవీలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటించింది. ఈ మూవీని త్వరలోనే విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇదిలా వుంటే సుకుమార్ డైరెక్ట్ చేసిన వన్ నేనొక్కడినే రంగస్థలం పుష్ప చిత్రాలకు రైటర్ గానూ పని చేసిన పల్నాటి సూర్య ప్రతాప్ కు తాజాగా భారీ చిత్రాలని నిర్మాణ సంస్థ సితార ఎంటర్ టైన్ మెంట్స్ ఓ క్రేజీ మూవీని రూపొందించే అవకాశం ఇచ్చినట్టుగా తెలుస్తోంది.ఇటీవల పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తో 'భీమ్లా నాయక్' సిద్ధూ జొన్నల గడ్డతో 'డీజే టిల్లు'వంటి హిట్ చిత్రాలని అందించిన సితార ఎంటర్ టైన్ మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ దర్శకుడు పల్నాటి సూర్య ప్రతాప్ డైరెక్షన్ లో ఓ మూవీని నిర్మించబోతున్నారట. దీనికి సంబంధించిన అఫీషియల్ అనౌన్స్ మెంట్ త్వరలోనే రానుందని తెలిసింది.ప్రస్తుతం ఫార్చ్యూన్ 4 సినిమాస్ బ్యానర్ తో కలిసి సితార ఎంటర్ టైన్ మెంట్స్ పై సూర్యదేవర నాగవంశీ తమిళ హీరో ధనుష్ తో 'సార్' పేరుతో ఓ ద్వి భాషా మూవీని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. వెంకీ అట్లూరి డైరెక్ట్ చేస్తున్న ఈమూవీ ప్రస్తుతం చిత్రీకరణ దశలో వుంది. అ మూవీతో పాటే పల్నాటి సూర్య ప్రతాప్ మూవీని సెట్స్ పైకి తీసుకెళ్లనున్నారట. ఇందులో నటించే హీరో ఎవరు? అనే వివరాల్ని చిత్ర బృందం త్వరలోనే వెల్లడించనుందని తెలిసింది.



# భారత జట్టులో తెలుగు తేజాలు.. విహారి, భరత్.. మరి పంత్?

ఇంగ్లండ్తో రీషెడ్యూల్డ్ టెస్టుకు ముందు లీసెస్టర్షైర్ కౌంటీతో టీమిండియా వార్మప్ మ్యాచ్ మొదలైంది. లీసెస్టర్లోని గ్రేస్రోడ్ స్టేడియంలో నాలుగు రోజుల పాటు ఈ మ్యాచ్ జరుగనుంది. ఇక ఈ మ్యాచ్లో టీమిండియా బ్యాటర్లు ఛతేశ్వర్ పుజారా, రిషభ్ పంత్, పేసర్లు జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ కృష్ణ లీసెస్టర్షైర్ తరఫున బరిలోకి దిగారు.మరోవైపు రోహిత్ శర్మలో సారథ్యంలోని భారత జట్టులో తెలుగు క్రికెటర్లు హనుమ విహారి, వికెట్ కీపర్ బ్యాటర్ శ్రీకర్ భరత్ భాగమయ్యారు. ఈ మ్యాచ్లో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకోగా.. బుమ్రా బౌలింగ్ అటాక్ ఆరంభించాడు. కాగా గతేడాది పర్యటన సందర్భంగా ఇంగ్లండ్తో జరగాల్సిన ఐదో టెస్టు కరోనా కారణంగా వాయిదా పడిన సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో టీమిండియా తాజా పర్యటనలో భాగంగా రీషెడ్యూల్డ్ టెస్టుతో పాటు మూడు మ్యాచ్ల టీ20, వన్డే సిరీస్లు ఆడనుంది. కాగా గత టూర్లో భారత జట్టు 2-1 తేడాతో ఆధిక్యం సాధించడంలో కీలక పాత్ర పోషించిన భారత్ స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఈ రీషెడ్యూల్డ్ మ్యాచ్కు దూరమయ్యాడు.ఇక భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆరంభమైన వార్మప్ మ్యాచ్.. లీసెస్టర్షైర్ కౌంటీ అఫీషియల్ యూట్యూబ్ చానల్ 'ఫాక్సెస్ టీవీ'లో ప్రత్యక్ష ప్రసారం అవుతోంది.

లీసెస్టర్షైర్ వర్సెస్ భారత్ వార్మప్ మ్యాచ్ జట్ల వివరాలు ఇలా:లీసెస్టర్షైర్ జట్టు:సామ్యూల్ ఈవన్స్(కెప్టెన్), లూయిస్ కింబర్, ఛతేశ్వర్ పుజారా, రిషభ్ పంత్, రేహాన్ అహ్మద్, సామ్యూల్ బేట్స్(వికెట్ కీపర్), రోమన్ వాకర్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ కృష్ణ, విల్ డేవిస్, నాథన్ బౌలే, అబిడినే సకాండే, జోయ్ ఎవిసన్.భారత జట్టు:రోహిత్ శర్మ(కెప్టెన్), శుబ్మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, విరాట్ కోహ్లి, హనుమ విహారి, శ్రీకర్ భరత్(వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్, ఉమేశ్ యాదవ్.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190